ఇంటర్మీడియట్ పరీక్షలకు ఏర్పాట్లు

-ప్రత్యేక అధికారి వినోద్ బాబు

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: మార్చిలో జరగనున్న ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల సౌకర్యాల ఏర్పాట్లకు చర్యలు తీసుకుంటున్నట్లు ఇంటర్మీడియట్ పరీక్షల ప్రత్యేక అధికారి వినోద్ బాబు చెప్పారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం ఆయన సందర్శించి పరీక్షల ఏర్పాట్లకు తగిన సౌకర్యాలపై సిబ్బందిని అడిగి తెలుసుకుని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 11 మండలాలు, ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో 9 మండలాలను కలుపుకుని మొత్తం 20 మండలాల్లో ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు సౌకర్యవంతంగా ఉండేందుకు అన్ని రకాల ఏర్పాట్లను కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ వైబివిఎస్ చంద్రశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

వైసిపి ఎన్నికల సమరోత్సాహం

- క్యాడర్‌ను ఉత్తేజపరిచిన జగన్
- చంద్రబాబులా పొత్తుల కోసం వెంపర్లాడనని ఉద్ఘాటన
- ప్రజలే నా ధైర్యం.. సంక్షేమమే విధానం
- పార్టీని భుజాన వేసుకున్న వారికి ఎప్పుడూ ప్రాధాన్యత ఉంటుందని ప్రకటన
- విశాఖ జిల్లా సంగివలస వద్ద భారీ సభ
- వేలాదిగా తరలొచ్చిన అధికార పార్టీ కార్యకర్తలు



బహిరంగ సభలో మాట్లాడుతున్న సిఎం జగన్‌మోహన్‌రెడ్డి

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో:'75 ఏళ్ల వయసు మళ్లిన చంద్రబాబు మాదిరిగా నేను పొత్తుల కోసం దత్తపుత్రుడు, ఇతరుల వెంట వెంపర్లాడను. ప్రజలే నా ధైర్యం.. సంక్షేమం, అభివృద్ధి పథకాలే నా విధానం' - అని వైసిపి అధినేత, రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అన్నారు. రానున్న ఎన్నికలకు సన్నద్ధంగా విశాఖ జిల్లా భీమిలిలోని సంగివలస వద్ద శనివారం సాయంత్రం వైసిపి ఉత్తరాంధ్ర క్యాడర్‌తో భారీ సభ నిర్వహించారు. దీనికి సిద్ధం సభగా ట్యాగ్‌లైన్ జతచేశారు. ఉత్తరాంధ్ర నలువైపుల నుంచీ తరలివచ్చిన కార్యకర్తలను ఉద్దేశించి జగన్ మాట్లాడారు. ఎన్నికల శంఖారావం పూరించారు. క్యాడర్‌కు 2024 ఎన్నికలపై దిశానిర్దేశం చేస్తూ విపక్షాలపై పెద్ద ఎత్తున విరుచుకుపడ్డారు. పార్టీ క్యాడర్‌లో ఎన్నికల సమరోత్సాహాన్ని నింపారు. సభకు వేల సంఖ్యలో పార్టీ క్యాడర్ తరలిరావడంతో భీమిలిలో ఇవాళ తనకు అటు సముద్రం, ఇటు జనసముద్రం కనిపిస్తుందని జగన్ వ్యాఖ్యానించారు. సభకు వచ్చిన ప్రతి ఒక్కరిలోనూ ఒక్కో సేనాధిపతి కనిపిస్తున్నారని అన్నారు. ఇటు పక్క పాండవ సైన్యం ఉంటే, అటుపక్క కౌరవ సైన్యం ఉందని అన్నారు. ఈ యుద్ధంలో చంద్రబాబు సహా ప్రతి ఒక్కరూ ఓడిపోక తప్పదంటూ సమరోత్సాహాన్ని ప్రదర్శించారు. పద్మవ్యూహంలో చిక్కుకోవడానికి తాను అభిమన్యుడిని కాదని అర్జునుడినని చెప్పారు. ఈ అర్జునుడికి శ్రీకృష్ణుడిలాగ ప్రజలు తోడున్నారన్నారు. 2024 ఎన్నికల్లో వైసిపికి 175కి 175 రావడం ఖాయమన్నారు. చంద్రబాబుకు ఒంటరిగా పోటీచేసే ధైర్యం లేదన్నారు. 2019 ఎన్నికల్లో వచ్చిన 23 సీట్లు కూడా ఈసారి వారికి రావన్నారు. చంద్రబాబు చెప్పుకోవడానికి ఏమీలేదని అన్నారు కరోనా కష్టకాలంలోనూ ఆర్థిక లాభనష్టాల లెక్కను చూడకుండా తాము సంక్షేమం ఇచ్చామన్నారు. అప్పట్లో చంద్రబాబు రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన 650 హామీల్లో 10 శాతం కూడా అమలుచేయకుండా అన్నింటినీ అటకెక్కించేశాడని విమర్శించారు. హామీలు అటకెక్కించిన బాబు ఇంకా బతికే ఉన్నాడని ప్రజలకు వివరించాల్సిందిగా క్యాడర్‌కు జగన్ దిశానిర్దేశం చేశారు. వాలంటీర్లు మనలోంచి వచ్చిన మనవాళ్లేనని, బయటవారు కాదని క్యాడర్‌కు తెలిపారు. 2019 నుంచి 99 శాతం హామీలను అమలు చేశామన్నారు.

తామూ ఎన్నికలకు సిద్ధమంటూ చేతులెత్తి నినదిస్తున్న వైసిపి కార్యకర్తలు

అవీ..ఇవీ...

తగరపువలస : సభాస్థలికి వైఎస్.జగన్ మధ్యాహ్నం 3.30 గంటలకు రావాల్సి ఉండగా, 25 నిమిషాలు ఆలస్యంగా వచ్చారు. తొలుత తన తండ్రి, మాజీ ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. 4.09 గంటలకు జగన్ తన ప్రసంగాన్ని ప్రారంభించి, 5.26 గంటలకు ముగించారు.

ప్రతిమాటకూ క్యాడర్ హర్షధ్వానాలు

వేదిక మీదకు వస్తూనే తన సహజ శైలిలో రెండు చేతులనూ జోడించి నమస్కారం చేశారు. భీమిలిలో అటు సముద్రం.. ఇటు జన సముద్రం అంటూ తన ప్రసంగాన్ని ప్రారంభించారు. ఎన్నికల మ్యానిఫెస్టోను భగవద్గీత, బైబిలు, ఖురాన్‌గా భావించి 99 శాతం హామీలు అమలు చేశామని జగన్ అన్నప్పుడు 'సిఎం, సిఎం' అంటూ కార్యకర్తలు సభలో పెద్దపెట్టున నినాదాలు చేశారు శ్రీమంతుల పిల్లల చేతుల్లో ఉండే ట్యాబ్‌లు.. ఇప్పుడు ప్రభుత్వ బడి పిల్లల్లో ఉన్నాయని, ఎస్‌సి, ఎస్‌టి, బిసిలకు తగిన ప్రాధాన్యత ఇచ్చామని జగన్ అన్నప్పుడు సభలో హర్షధ్వానాలు వినబడ్డాయి. 'మీ పిల్లల తలరాత మారాలన్నా.. పేదల భవిష్యత్తు మారాలన్నా ఎన్నికల్లో జగనే రావాలి' అనడంతో వేదిక ముందు ఉన్న వారు వారి చేతుల్లో ఉన్న 'సిద్ధం' ప్లకార్డులను చూపారు. సిఎం వేదిక మీదకు వచ్చే సమయంలో స్పీకర్ తమ్మినేని సీతారాం, మంత్రులు బొత్స సత్యనారాయణ, ధర్మాన ప్రసాదరావు, సీదిరి అప్పలరాజు, విడదల రజిని, స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, పలువురు శాసన సభ్యులు, శాసన మండలి సభ్యులు, మాజీ ఎంపీ బొత్స ఝాన్సీలక్ష్మి స్వాగతం పలికారు.

విద్యార్థులకు మోడల్ పేపర్లు అందజేసిన యుటిఎఫ్ నాయకులు

యుటిఎఫ్ ఆధ్వర్యాన ఎస్ఎస్‌సి మోడల్ పేపర్లు పంపిణీ

ప్రజాశక్తి-విఆర్.పురం

మండలంలో రేఖపల్లిలోని కస్తూర్బగాంధీ బాలికల విద్యాలయంలో ఇంగ్లీష్ మీడియం విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు ఎస్ఎస్‌సి మోడల్ పేపర్లను ఆంధ్ర ప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) ఆధ్వర్యాన శనివారం అందజేశారు. అమరజీవులు మాజీ ఎమ్మెల్యే కామ్రేడ్ సున్నం రాజయ్య, మాజీ ఎంపీపీ కామ్రేడ్ కారం శిరమయ్య కుటుంబ సభ్యుల ఆర్థిక సహకారంతో యుటిఎఫ్ విఆర్.పురం మండల కమిటీ వీటిని అందజేసింది. ఈ సందర్భంగా యుటిఎఫ్ మండల అధ్యక్షులు కె.వెంకట్ మాట్లాడుతూ మార్చి మాసంలో జరిగే పదో తరగతి పరీక్షలకు ఈ మోడల్ పేపర్లు చాలా ఉపయుక్తంగా ఉంటాయని తెలిపారు. విద్యార్థులు ఎటువంటి ఒత్తిడికి గురికాకుండా మంచిగా పరీక్షలు రాయాలని సూచించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్.నాగేశ్వరరావు, కోశాధికారి ఎం.బాబు, ఓ మంగారావు రెడ్డి, కెజిబివి స్పెషలాఫీసర్ పి.వెంకమ్మ, పిఇటి కె.లక్ష్మి, దుర్గ, యు.కుమారి, సుజాత, కుమారి, స్నేహ, హారిక, రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

వచ్చే నెలలో బచ్చలమల్లి సినిమా షూటింగ్

ప్రజాశక్తి- నక్కపల్లి:హాస్య మూవీస్ బ్యానర్ పై అల్లరి నరేష్, అమృత అయ్యర్ (హనుమాన్ ఫేమ్) హీరో హీరోయిన్‌లుగా తెరకెక్కిస్తున్న బచ్చలమల్లి సినిమా షూటింగ్ రెండవ షెడ్యూల్ నక్కపల్లి మండలం ఉపమాక, నక్కపల్లి పరిసర ప్రాంతాల్లో ఫిబ్రవరి నెలలో చిత్రీకరణ చేయనున్నట్లు చిత్ర దర్శకుడు బి.సుబ్బు మంగాదేవి తెలిపారు .చిత్ర టెక్నీషియన్ బృందంతో కలిసి శనివారం ఆయన నక్కపల్లి, ఉపమాక పరిసర ప్రాంతాల్లో లొకేషన్ లను పరిశీలించారు. నక్కపల్లిలో నూకాలమ్మ ఆలయం, ఉపమాకలో వెంకన్న ఆలయం, చెరువు ,ఆలయ పరిసర ప్రాంతాలను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆధ్యాత్మిక, యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరించేం దుకు నక్కపల్లి నూకాలమ్మ ఆలయం, ఉపమాక ఆలయ పరిసర ప్రాంతాలు అనువుగా వున్నట్టు చిత్ర యూనిట్ గుర్తించిందన్నారు. ఫిబ్రవరి నెలలో ఈ ప్రాంతంలో చిత్ర చిత్రీకరణ చేపడతామన్నారు.ఈ చిత్రానికి నిర్మాత రాజేష్ దండా, కెమెరామెన్ రిచర్డ్ నాథన్ ,స్క్రీన్ ప్లే రైటర్ మధు విప్పర్తి, మ్యూజిక్ డైరెక్టర్ విశాల్ చంద్రశేఖర్ (సీతారామ ఫేమ్), ఆర్ట్ డైరెక్టర్ బ్రహ్మ కడలి, కో డైరెక్టర్ నాగిరెడ్డి, మేనేజర్ చంద్రశేఖర్, డైరెక్షన్ డిపార్ట్మెంట్ ఒనుముల బుచ్చిరాజు వ్యవహరిస్తున్నారని, దసరాకు సినిమా విడుదల చేస్తామని తెలిపారు.

నిందితులను శిక్షించాలి

ప్రజాశక్తి- పెదబయలు:స్థానిక ఆంధ్రప్రభ విలేకరి కొమ్మ కొండబాబు పై అక్రమంగా దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని శనివారం స్థానిక పోలీసు స్టేషన్‌లో పాత్రికేయులు పిర్యాదు చేశారు. పాత్రికేయుల కథనం మేరకు... గురువారం సాయంత్రం లక్ష్మీపేట పంచాయతీ టోట్టోడిపుట్టు మెయిన్ రోడ్డు పై ద్విచక్ర వాహనం ఢీ కొని బాలుడు మృతి చెందడంతో ఈ వార్త కవరేజ్ కోసం వెళ్లిన ఆంధ్రప్రభ విలేకరి కొండబాబుపై దాడి చేసి గాయపరిచారన్నారు. జేబులో ఉన్న పదివేల రూపాయలు దోచుకున్నారని బాధితుడు కొండబాబు తెలిపారు. నిందితుల్ని కఠినంగా శిక్షించాలని పోలీసుల పిర్యాదులో పేర్కొన్నారు.

ఏరియా ఆసుపత్రిలో తనిఖీలు చేస్తున్న సబ్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్

ఏరియా ఆసుపత్రిలో సబ్ కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి-రంపచోడవరం

స్థానిక ఏరియా హాస్పిటల్‌లో రంపచోడవరం సబ్ కలెక్టర్ ఎస్ ప్రశాంత్ కుమార్ శనివారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఆసుపత్రిలో వార్డులు, రూములు సందర్శించారు. ఆధునిక ల్యాబ్లోని పరీక్ష పరికరాలను పరిశీలించి వాటి వివరాలు అడిగి తెలుసుకున్నారు. హాస్పిటల్ రోగుల ఆరోగ్యం, అందుతున్న సేవలపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

31న రీజనల్ జాబ్ మేళా

ప్రజాశక్తి-పాడేరు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ జిల్లా ఉపాధి కార్యాలయం, సీ డాప్ సంయుక్త ఆధ్వర్యంలో విజయనగరంలోని సీతం ఇంజినీరింగ్ కాలేజ్‌లో ఈనెల 31న ఉదయం 9గంటల నుండి రీజినల్ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి జి. ప్రశాంత్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రీజినల్ జాబ్ మేళాలో ఐటీ, ఫార్మా, రిటైల్, మెడికల్, ఆటోమొబైల్, ఇతర రంగాలకు చెందిన 84 కంపెనీలు పాల్గొంటాయన్నారు. జిల్లాలోని 18 నుండి 35 సంవత్సరాల మధ్య గల పదవ తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ ఆపై చదువు పూర్తి చేసిన నిరుద్యోగ యువతీ యువకులు 31న నేరుగా ఇంటర్వ్యూకు పాన్ కార్డు, ఆధార్ కార్డు అర్హత సర్టిఫికేట్స్ జిరాక్స్ కాపీలతో హాజరు కావాలని తెలిపారు. ఇంటర్వ్యూ లో ఎంపిక కాబడిన అభ్యర్థులకు నెలకు రూ.10,000 నుండి 30,000 వరకు జీతం ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. పూర్తి వివరాలకు ఫోన్:6304634447 నంబరులో సంప్రదించాలన్నారు.

ర్యాలీ చేపడుతున్న ఎలక్ట్రీషియన్లు

ఘనంగా ఎలక్ట్రీషియన్స్ దినోత్సవం

-పాడేరులో ర్యాలీ.. జెండా ఆవిష్కరణ

ప్రజాశక్తి-పాడేరు: అల్లూరి సీతారామరాజు జిల్లా కేంద్రం పాడేరులో శనివారం ఎలక్ట్రిషన్ డే ఘనంగా నిర్వహించారు. ఉమా నీలకంఠేశ్వర ఎలక్ట్రీషియన్ అండ్ ప్లంబర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని మోదకొండమ్మ ఆలయ ప్రాంగణంలో జండా ఆవిష్కరణ నిర్వహించారు. అనంతరం పురవీధుల్లో ఎలక్ట్రీషియన్లు ర్యాలీ నిర్వహించారు. శాస్త్రవేత్త థామస్ అల్వా ఎడిషన్ చీకట్లను పారదోలి వెలుగును ప్రసాదిస్తూ జనవరి 27, 1880 సంవత్సరమున విద్యుత్ బల్బు రూపొందించారని కొనియాడారు. దీంతో, ఎలక్ట్రీషియన్స్ డేను చేయడం జరుగుతుందని అల్లూరి జిల్లా ప్రైవేట్ ఎలక్ట్రిషన్ వ్యవస్థాపక అధ్యక్షులు కొట్టగుల్లి రామారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో నూతన జిల్లా అధ్యక్షులు మహమ్మద్ అనీఫ్, జిల్లా ప్రధాన కార్యదర్శి సందడి దామోదరం, పాడేరు శ్రీ మోద ఉమా నీలకంఠేశ్వర అధ్యక్షులు పొట్నూరి బబ్లు, అల్లూరి జిల్లా కోశాధికారి మట్టం స్వామి నాయుడు, అయ్యల నరేంద్ర, సరమండ వరప్రసాద్, కిల్లు హరిబాబు, గోకాడ కృష్ణారావు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష వైద్య శిబిరం

ప్రజాశక్తి- పెదబయలు :మండలంలోని సీకారి పంచాయతీ కేంద్రంలో శనివారం జగనన్న సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 200 మంది వ్యాధి గ్రస్తులు తరలి వచ్చారు. 14 మందిని మెరుగైన వైద్యం కోసం తరలించారు. వీరిలో ముగ్గురికి సాధారణ జ్వరాలున్నాయి. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు స్నేహిత రెడ్డి, గీతాంజలి, నిఖిల్, సత్యశ్రీ, వెంకటరావు, ఎంపీహెచ్ఓ సింహాచలం, తదితరులు పాల్గొన్నారు.

హాజరైన వైద్యులు, సిబ్బంది

ఐటిడిఎ ఎదుట సెర్ప్ ఉద్యోగుల ధర్నా

ప్రజాశక్తి -రంపచోడవరం

తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ సెర్ప్ ఎంప్లాయిస్ జెఎసి పిలుపు మేరకు గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) ఉద్యోగులు నిరవధిక సమ్మెలో భాగంగా శనివారం స్థానిక ఐటిడిఎ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జెఎసి నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వైఎస్సార్ ఆసరా, చేయూత, నాడు నేడు, సున్నా వడ్డీ, జగనన్న తోడు, జగనన్న హౌసింగ్ కాలనీల నిర్మాణం, పేదలకు సుస్థిర జీవనోపాధి పెంపునదల వంటి సంక్షేమ పథకాల అమల్లో కీలక పాత్ర పోషిస్తున్నామని తెలిపారు. 23 ఏళ్లగా పని చేస్తున్న తమను రెగ్యులరైజ్ చేస్తామని గత ఎన్నికలకు ముందు హామీని అమలు చేయాలని కోరారు. సెర్ప్‌ను ప్రభుత్వ సంస్థగా గుర్తించి, ఉద్యోగులకు కేడర్ ఫిక్స్ చేస్తూ, పేస్కేల్ అమలు చేసి, సర్వీసును రెగ్యులర్ చేయాలని, ప్రస్తుతం ఉన్న సీలింగ్ విధానాన్ని తీసివేసి మూలవేతనంపై 100 శాతం ఇపిఎఫ్ ఇవ్వాలని, అన్ని కేడర్స్‌కు ఉద్యోగోన్నతి ఇంక్రిమెంట్ ఇవ్వాలని, రూల్ ఆఫ్ రిజర్వేషన్స్ వర్తింపజేసి అర్హులైన ఉద్యోగులందరికీ ప్రమోషన్లు కల్పించాలని, కారుణ్య నియామకాలు జరిపి మరణించిన వారి కుటుంబాలకు న్యాయం చేయాలని, సెర్ప్ సిబ్బంది ఉద్యోగ విరమణ వయసు 62 సంవత్సరాలకు పెంచాలని, ప్రభుత్వ ఉద్యోగులకు అమలు చేస్తున్న గ్రాట్యుటీ రూ.16 లక్షలు, హెచ్‌ఆర్ఎ తమకు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలపై మూడేళ్లగా ప్రభుత్వం దృష్టికి తీసుకొస్తున్నా పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యలపై ఈ నెల 8న మరో సారి ప్రభుత్వానికి విన్నవించినా ప్రభుత్వం స్పందించకపోవడంతో నిరవధిక సమ్మె చేస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సెర్ప్ ఎపిఒ శ్రీనివాసరావు, ఎపిఎం హెచ్ఆర్ రాధా అపర్ణ, ఎపిఎం దుర్గా ప్రసాద్, అడ్మిన్‌అసిస్టెంట్ శ్రీనివాస్‌దొర, సిసిలు కృష్ణ, జేమ్స్, పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

8న చలో విజయవాడను జయప్రదం చేయండి

ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నాయకులు వాణిశ్రీ

ప్రజాశక్తి-రంపచోడవరం

ఆశా వర్కర్ల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతూ ఫిబ్రవరి 8న చలో విజయవాడ కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ఇందులో ఏజెన్సీ 11 మండలాల నుండి ఆశా వర్కర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర నాయకులు మట్ల వాణిశ్రీ పిలుపునిచ్చారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో కలింకోట రమణమ్మ అధ్యక్షతన శనివారం జరిగిన యూనియన్ జిల్లా కమిటీ సమావేశంలో వాణిశ్రీ ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడారు. కనీస వేతనం, రిటైర్మెంట్ బెనిఫిట్స్, ప్రమాద బీమా సౌకర్యం, సంక్షేమ పథకాలు అమలు, 66 రోజుల దీక్షల్లో ఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని కోరుతూ ఈ కార్యక్రమం చేపట్టినట్లు చెప్పారు.

కార్యక్రమంలో పాల్గొన్న వాణిశ్రీ, ఆశా కార్యకర్తలు

క్రీడాకారులకు ఎంపిపి అభినందనలు

ప్రజాశక్తి రంపచోడవరం

మసురుమిల్లి ఆశ్రమ పాఠశాలలో జరిగిన నియోజకవర్గ స్థాయి ఆడుదాం ఆంధ్రా వాలీబాల్ ఫైనల్ పోటీల్లో కూనవరం జట్టుపై విజయం సాధించి విజేతగా నిలిచిన రంపచోడవరం (తామరపల్లి సచివాలయం) జట్టు కెప్టెన్ శారపు చినసోమన్న దొర, జట్టు సభ్యులను రంపచోడవరం ఎంపీపీ బందం శ్రీదేవి, జెసిఎస్ కన్వీనర్ పండా రామకృష్ణ దొర, ఎంపీడీవో హరికృష్ణ, సర్పంచ్ ఆనంద్, మాజీ సర్పంచ్ శారపు బాపిరాజు తదితరులు శనివారం అభినందించారు. ఈ ఆడుదా ఆంధ్రా వాలీబాల్ క్రీడా పోటీల్లో రెండవ స్థానంలో కూనవరం జట్టు, మూడవ స్థానంలో రాజవొమ్మంగి జట్టు నిలిచాయి. ఇదే స్ఫూర్తితో జిల్లా, రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో రంపచోడవరం మండలాన్ని నిలబెట్టాలని, కావాల్సిన సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయని ఎంపిపి తెలిపారు.

ప్రథమ స్థానం సాధించిన క్రీడాకారులతో ఎంపిపి బంధం శ్రీదేవి తదితరులు

సిఐగా వెంకటరమణ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి- కొయ్యూరు : కొయ్యూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పి.వెంకటరమణ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకూ ఇక్కడ సీఐగా పనిచేసిన ఆర్ఎస్‌కే బాజీలాల్ వీఆర్ ఏలూరు రేంజ్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో అల్లూరి సీతారామరాజు జిల్లా డీటీసీలో సీఐగా విధులు నిర్వహిస్తున్న పి.వెంకటరమణ కొయ్యూరు సీఐగా నియమితులయ్యారు. శనివారం బాధ్యతలను స్వీకరించిన వెంకటరమణకు కొయ్యూరు ఎస్సై రామకృష్ణ, మంప ఎస్సై లోకేష్ కుమార్ శుభాకాంక్షలు తెలిపారు.

అంగన్వాడీ పోస్టుల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి కొయ్యూరు : కొయ్యూరు మండలంలో ఖాళీగా ఉన్న నాలుగు అంగన్వాడీ పోస్టుల భర్తీకి ధరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఐసీడీఎస్ సీడీపీవో విజయ కుమారి తెలిపారు. శనివారం ఆమె స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ మండలంలోని భీమవరం అంగన్వాడీ కేంద్రంలో మినీ అంగన్వాడీ కార్యకర్త, మర్రిపాలెం, జెర్రిగొంది, ఆర్.దొడ్డవరం అంగన్వాడీ కేంద్రాల్లో ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయని చెప్పారు. స్థానికంగా నివాసం ఉండే వివాహిత మహిళలు ఫిబ్రవరి నెల 10వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సీడీపీవో సూచించారు.

క్రికెట్ మైదానంలో స్టేజీ నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-చింతూరు : చింతూరు సంతపాకల క్రికెట్ గ్రౌండ్లో స్టేజీ నిర్మాణానికి సింగంశెట్టి దుర్గారావు శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణేష్, ప్రదీప్, రియాజ్, షహేన్ షా, జీవన్, అక్బర్, కుప్పు స్వామి, జల్లి నరేష్, వీర్రాజు, ఆరిఫ్ తదితర క్రికెట్ క్రీడాభిమానులు, రాజకీయ, గిరిజన సంఘాల నాయకులు, చింతూరు ప్రజల కోరిక మేరకు వంగవీటి మోహన రంగా 34 వర్ధంతి సందర్భంగా కోల కన్నయ్య జ్ఞాపకార్థం రూ.1.20 లక్షలతో ఈ స్టేజీని నిర్మిస్తున్నట్లు చెప్పారు.

కార్యక్రమంలో పాల్గొన్న దుర్గారావు, స్థానికులు

ప్రభుత్వ ధరకే సిలిండర్లు విక్రయించాలి

జాయింట్ కలెక్టర్ కార్తీక్ ఆదేశం

ప్రజాశక్తి -పాడేరు: గృహావసరములకు వంట గ్యాస్‌న ఎల్పిజి డీలర్లు ప్రభుత్వం నిర్దేశించిన ధరకు మాత్రమే గ్యాస్ రీఫిల్ (సిలిండర్) సరఫరా చేయాలని, బిల్లులో సూచించిన ధర కంటే ఎక్కువ డబ్బు డిమాండ్ చేస్తే కఠిన చర్యలు తప్పవని సంయుక్త కలెక్టర్ కె.కార్తీక్ ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఈ మేరకు ఇటీవల కాలములో కొంతమంది వినియోగదారుల నుంచి ఫిర్యాదులు అందినట్లు ఆయన తెలిపారు. వంటకు ఉపయోగించే 14.2 కేజీల గ్యాస్ సిలిండర్ కు బిల్లులో ఉన్న మొత్తము కంటే అధికంగా వినియోగదారుడు చెల్లించవలసిన అవసరం లేదన్నారు. కొందరు గ్యాస్ డెలివరి బాయ్స్, గ్యాస్ ఏజెన్సీ యజమానులు వారి గోడౌన్ నుండి డెలివరి పాయింట్ దూరముగా ఉన్నందున ట్రాన్స్ పోర్టు చార్జీల కింద గ్యాస్ సిలిండర్ కు బిల్లులో ఉన్న వాటి కంటే అధికంగా వినియోగదారుల నుండి అధికంగా వసూలు చేస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందని తెలిపారు. ఇది చట్ట రీత్యా నేరమని జేసి వివరించారు. అటువంటి గ్యాస్ డీలర్లపై చట్ట పరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. జిల్లాలోని గ్యాస్ వినియోగదారులు బిల్లుపై వున్న గ్యాస్ ధర మాత్రమే చెల్లించాలని సూచించారు. ఎటువంటి అదనపు రవాణా ఛార్జీలు చెల్లించవలసిన అవసరం లేదని, ఎవరైనా అధికంగా డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేస్తే వినియోగ దారులు సంబంధిత అధికారులకు లేదా టోల్ ఫ్రీ నెంబర్ 1967 లేదా 18002333555 నెంబరుకు ఫిర్యాదు చేయవచ్చునని తెలిపారు. . సిలిండర్ కు వున్న సీలు పై అనుమానము ఉంటే వినియోగదారుని సమక్షములో సీలు తీసి చూపించవలసిన భాద్యత డెలివరి బోయ్ కు ఉందని వినియోగదారులు గుర్తించాలన్నారు. సంబందిత అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించి గ్యాస్ పంపిణీ పై ఎలాంటి ఫిర్యాదులు రాకుండా భాద్యత వహించాలని ఆదేశించారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తులు

ప్రజాశక్తి-హుకుంపేట:మండలంలోని అంగన్వాడి కార్యకర్తల, ఆయా పోస్టులను భర్తీ చేస్తామని శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ అధికారిని సిహెచ్ బాలమణి దేవి శనివారం ప్రకటనలో పేర్కొన్నారు. అంగన్వాడి కార్యకర్త 1, ఆయా 1, మినీ 2 కార్యకర్తలు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. కొట్నాపల్లి పంచాయతీ మారెల గ్రామంలోని అంగన్వాడి కార్యకర్త 1, పాతకోట, పి.బొడ్డపుట్టు, మినీ అంగన్వాడి 1, తాడేపుట్టు పంచాయతీ ఉర్రడ నిమ్మలపాడులో మినీ అంగన్వాడి కార్యకర్త 1 కొంతిలి పంచాయతీ కొంతిలి ముంచంగిపుట్టు గ్రామంలో అంగన్వాడి సహాయకురాలు 1 పోస్టు భర్తీ చేస్తామన్నారు. స్థానికులు మాత్రమే ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని ఆమె కోరారు.

అరకులోయ రూరల్:అరకులోయ మండలం పెదలబుడు మేజర్ పంచాయతీ శరభగుడ, లోతేరు పంచాయితీ పెదవలసలో ఖాళీగా ఉన్న అంగన్వాడీ , ఆయా పోస్టల భర్తీకి అరకువేలి ప్రోజెక్ట్ అధికారులు నోటిఫికేషన్ విడుదల చేసారు. మహిళలు తప్పనిసరిగా పదోతరగతి ఉత్తీర్ణత పొంది, స్థానికంగా నివాసం కలిగి ఉండాలని, వివాహిత స్త్రీలు అర్హులన్నారు. సమగ్ర శిశు అభివృద్ధి పథకం అధికారి కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని కోరారు.

అనంతగిరి:అంగన్వాడి, కార్యకర్తలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపిఓ అధికారిణి సంతోషి కుమారి ఒక ప్రకటనలో శనివారం పేర్కొన్నారు. ఆయా పోస్టులు 4, మిన్నీ అంగనవాడి 3 పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలపారు, ఎన్ఆర్ పురం పంచాయతీ పెద్దకోనెల, జీనబాడు పంచాయతీ దాయర్తి, బీంపోలు పంచాయితీ సిమిడిపల్లి, బొర్రా పంచాయితీ నిన్నిమామిడిలో ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. మినీ అంగన్వాడి పోస్టుకు బిపోలు పంచాయితీ సీతపాడు, పినకోట పంచాయతీ తట్టపూడి, కోనపురం పంచాయతీ బొండియగూడలో ఖాళీలు ఉన్నాయన్నారు.

131 మందికి దంత వైద్య డిగ్రీల ప్రదానం

ప్రజాశక్తి-మధురవాడ : గీతం దంత వైద్య కళాశాల, ఆస్పత్రి ఆధ్వర్యాన 17వ పట్టభద్రుల దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి గీతం అధ్యక్షుడు ఎం.శ్రీభరత్ అధ్యక్షత వహించి ప్రసంగించారు. గాంధీ మార్గంలో సత్యం, ధర్మం, సమాజం పట్ల బాధ్యత, వృత్తి విలువలను పాటించడం ద్వారా వైద్యులు ఉన్నత స్థానానికి చేరాలని పిలుపునిచ్చారు. గ్రామీణ ప్రాంతాలలో దంత వైద్యానికి ప్రాచుర్యం కల్పించడం ద్వారా అవకాశాలను పెంచుకోవాలన్నారు. గీతం దంత వైద్య కళాశాల ద్వారా పరిశోధనలపై ప్రధానంగా దృష్టి సారించనున్నట్లు తెలిపారు.

గీతం దంత కళాశాల, ఆసుపత్రి నుంచి బ్యాచులర్ ఆఫ్ డెంటల్ సైన్సెస్ (బిడిఎస్), మాస్టర్ ఆఫ్ డెంటల్ సైన్సెస్ (ఎమ్‌డిఎస్) కోర్సులు పూర్తి చేసుకున్న 131 మంది వైద్య విద్యార్థులకు దంత వైద్యవిద్యా మండలి సభ్యుడు, మధ్యప్రదేశ్ వైద్య విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ అశోక్ ఖాండేల్‌వాల్ స్నాతకోత్తర డిగ్రీలను అందజేశారు. దంత వైద్యానికి దేశ వ్యాప్తంగా ఆదరణ పెరుగుతోందన్నారు.

భవన నిర్మాణ యజమానుల నుంచి...

సెస్‌ను విధిగా వసూలు చేయాలి

జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

ప్రజాశక్తి -పాడేరు:- ప్రభుత్వ, ప్రైవేట్ భవన నిర్మాణ యజమానుల నుంచి సెస్ విధిగా వసూలు చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో భవన, ఇతర నిర్మాణాల కార్మికుల సంక్షేమ సెస్ వసూలుపై సంబంధిత అధికారులతో బోర్డ్ సభ్యులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, భవన నిర్మాణాలు చేపట్టే యజమానులు మార్కెట్ విలువ ప్రకారం ఒక్క శాతం సెస్‌ను విధిగా చెల్లించాలని స్పష్టం చేశారు. కార్మికశాఖకు ఆన్లైన్, చలానా రూపంలో చెల్లించేందుకు అవకాశం ఉందన్నారు. కార్మికశాఖ అధికారులు ఈ విషయాన్ని భవన నిర్మాణాలు ప్రారంభించే సమయంలోనే యజమానులకు అవగాహనా కల్పించి సెస్‌ను వసూలు చేయాలని సూచించారు. వసూలు చేసిన సెస్ కార్మిక సంక్షేమ బోర్డుకు జమ చేయాలని ఇంజినీరింగ్ అధికారులను, ఎంపిడిఓలను కార్మిక శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వ పరంగా వివిధ ఇంజినీరింగ్ శాఖలు వసూలు చేసిన సెస్‌పై ఆరా తీసారు. వారి వద్ద పెండింగ్‌లో ఉన్న ఒక శాతం సెస్ వెంటనే కార్మిక సంక్షేమ బోర్డు కు చెల్లించమని కోరుతూ, సంబంధిత ఇ.ఇ.లకు లేఖలు రాయాలని కార్మిక శాఖ అధికారులకు ఆదేశించారు.

విశాఖపట్నం కార్మిక శాఖ ఉప కమిషనర్ ఎం.సునీత మాట్లాడుతూ, 2014 జూన్ 2 నుంచి శాఖల నివేదికలు అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ కమిషనర్ పి.సుజాత, సహాయ కార్మిక అధికారి పి.సూర్యనారాయణ, గిరిజన సంక్షేమ శాఖ ఇఇ కొండయ్య పడాల్, డివిజనల్ పంచాయతి అధికారి పిఎస్ కుమార్, జిల్లా పరిశ్రమల అధికారి, ఎంపిడిఓలు, ఇంజినీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణ దానం..

పాడేరు: రక్తదానం ప్రాణ దానంతో సమానమని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ అన్నారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఇండియన్ రెడ్ క్రాస్ సంస్థ నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఐటిడిఏ పిఓ వి.అభిషేక్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రాణా పాయంలో ఉన్న వారి ప్రాణాలను కాపాడడానికి దానం చేసిన రక్తం ఉపయోగపడుతుందన్నారు. రక్తదానంపై ప్రతీ ఒక్కరూ ముందుకు రావాలని పిలుపు నిచ్చారు. జిల్లాకు రక్త నిల్వలు అవసరమనిచెప్పారు. రక్తదానం చేసిన ఐటిడిఏ పి ఓ అభిషేక్ రెడ్ క్రాస్‌కు మూడవ సారి రక్తదానం చేసి యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సేకరించిన రక్తాన్ని బ్లడ్ బ్యాంకులో నిల్వ చేసి ఆపదలో ఉన్న వారికి రక్తం సరఫరా చేయడం జరుగు తుందన్నారు. మనం రక్తదానం చేయడంతో ఆపదలో ఉన్నప్పుడు మరొకరు దానం చేస్తారని అన్నారు. రక్తదానం చేయడానికి ప్రజలు ముందుకు రావాలని కోరారు. ఈ శిబిరంలో 13 యూనిట్ల రక్తాని సేకరించారని చెప్పారు. మండల కేంద్రాలు, సచివాలయాల పరిధిలో రక్తదాన శిబిరాలు నిర్వహించాలని రెడ్ క్రాస్ సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో డి.ఆర్ఓ అంబేద్కర్, ఎస్‌డిసి పి.మురళి, తహశీల్దార్ చిన్ని క్రిష్ణ, వైద్యులు రాజీవ్, రెడ్ క్రాస్ కో ఆర్డినేటర్ లోహితాస్, సభ్యులు పి. సూర్యారావు, ఎన్.ఎస్ఎస్. ప్రోగ్రాం అధికారి జి. గౌరీ శంకరరావు, రెడ్ క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

'బాబు ష్యూరిటీ.. భవిష్యత్తు గ్యారంటీ'పై ప్రచారం

ప్రజాశక్తి -పాడేరు:బడిమెల పంచాయతీ గొండేలి లో టిడిపి ఉమ్మడి విశాఖ జిల్లా అధికారి ప్రతినిధి కొట్టగుల్లి సుబ్బారావు ఆధ్వర్యంలో శనివారం బాబు షూరిటీ- భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ ప్రవేశపెట్టనున్న సంక్షేమ పథకాలు మహాశక్తి, అన్నదాతకు ఆర్థిక సహాయం, యువ గళం, బీసీల రక్షణ చట్టం, గిరిజనులకు భరోసాగా జీవో 3, గిరిజన అన్ని కులాలకు పెన్షన్లు వంటి కార్యక్రమాల గురించి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ, తెలుగుదేశం పార్టీ గిరిజనులకు అండగా ఉంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నారాయణ నాయుడు, బడిమల సర్పంచ్ సావిత్రమ్మ, మాజీ మండల పార్టీ ప్రెసిడెంట్ మచ్చ రాజు, బీసీ సెల్ నాయకులు బొడ్డేటి ఆనంద్‌రావు కించే సూర్యనారాయణ , కించే మచ్చ రాజు, కించే రమణ తెలుగు యువత కిముడు ప్రకాష్ పాల్గొన్నారు.

ప్రచారం చేపడుతున్న టిపిడి నేతలు

30న గీతం ఎడుయూత్ మీట్

ప్రజాశక్తి-మధురవాడ : సమాజంలో మానవత విలువలను పెంచడానికి "కలిసి నడుద్దాం, కలిసి ఎదుగుదాం, ముందుకు సాగుదాం" అనే నినాదంతో పాటు మత్తు మందుల వినియోగానికి వ్యతిరేకంగా యువత ప్రతిజ్ఞ చేయాలని పిలుపునిస్తూ గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, ఆధ్యాత్మిక సంస్థ ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంయుక్తంగా ఈ నెల 30వ తేదీన ఎడుయూత్ మీట్ పేరిట ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాయని గీతం అధ్యక్షుడు ఎమ్.శ్రీభరత్ తెలిపారు. గీతం విశ్వవిద్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను తెలియజేశారు. దాదాపు 25వేల మంది విద్యార్థులు వివిధ కళాశాలల నుంచి ఈ కార్యక్రమానికి హాజరు కానున్నారని ఆయన వెల్లడించారు. ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకులు, ఆధ్యాత్మికవేత్త గురుదేవ్ రవిశంకర్ హాజరై ప్రసంగిస్తారని తెలిపారు. ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థలో రెండు వేల మంది గీతం విద్యార్థులు సభ్యులుగా చేరి ప్రయోజనం పొందారని, చదువులో సహితం రాణిస్తున్నారని పేర్కొన్నారు. విశాఖలోని ఇతర కళాశాలల విద్యార్థులు తమ జీవితంలో అత్యుత్తమ ఫలితాలు సాధించడానికి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు.

నేరాలు ఘోరాలు

నిందితునితో పోలీసులు

41 లీటర్ల సారా స్వాధీనం

ప్రజాశక్తి -హుకుంపేట:గ్రామ స్థాయిలో నాటు సారాకు అడ్డుకట్టకు పోలీస్ శాఖ నిఘా ఏర్పాటు చేసిందని ఎస్సై పి.సతీష్ అన్నారు. శుక్రవారం సాయంత్రం మండలంలో దాలిగుమ్మడి గ్రామంలో అర్లభ శివకృష్ణ తన ఇంట్లో 41 లీటర్ల నాటుసారాతో పట్టుబడ్డాడని ఎస్సై అన్నారు.గ్రామ స్థాయిలో బెల్టుషాపులు నిలుపుదల చేయాలన్నారు.

నివాళులర్పిస్తున్న పోలీసులు

కానిస్టేబుల్‌కు ఘన నివాళి

ప్రజాశక్తి-పెదబయలు: అనకాపల్లి పోలీసు స్టేషన్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న కె.సన్యాసిదొర శుక్రవారం గుండె పోటుతో మృతి చెందాడు. మృతుడు స్వంత గ్రామమైన పెదబయలు మండలం లక్ష్మీపేట పంచాయతీ మండిబ గ్రామానికి మృతదేహాన్ని పోలీసులు తరలించారు. పోలీసు శాఖ తరపున అంతక్రియలు నిర్వహించారు.

ఎపిఎం శ్రీరాములుకు అవార్డు

ప్రజాశక్తి-అనంతగిరి:గణతంత్ర వేడుకల్లో భాగంగా జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ఏపిఎం టి.శ్రీరాములు పురస్కారం అందుకున్నారు.అతి తక్కువ సమయంలో మండల ఇన్చార్జి ఏపీఎంగా బాధ్యతలు స్వీకరించి స్వయం సహాయక సంఘ సభ్యులకు ఆయన సేవలందించారు. అవార్డు అందుకోవడంతో తోటి సిబ్బంది శ్రీ రాములుకు అభినందనలు తెలిపారు

ఉత్తమ అవార్డు అందుకుంటున్న ఎపిఎం శ్రీరాములు

అనూషను పరామర్శిస్తున్న సిపిఎం నాయకులు

అనూషకు సిపిఎం నేతల పరామర్శ

ప్రజాశక్తి-విఆర్.పురం : అనారోగ్యంతో బాధపడుతున్న మండలంలోని రేకపల్లి గ్రామానికి చెందిన చింతకాయల వెంకటేశ్వర్లు, సరస్వతి (బుజ్జి) దంపతుల కుమార్తె అనూషను సిపిఎం నాయకులు శనివారం పరామర్శించారు. కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న అనూషకు తెలంగాణలోని వరంగల్ ఆస్పత్రుల్లో వైద్యం అందించారు. ఆరోగ్యం కొంత మెరుగు పడటంతో ఆమెను స్వగ్రామం రేకపల్లి తీసుకొచ్చారు. దీంతో సిపిఎం జిల్లా సభ్యులు పూనం సత్యనారాయణ, మండల కార్యదర్శి సోయం చిన్నబాబు, నాయకులు కె.సత్యనారాయణ, గుండిపూడి లక్ష్మణరావు, నల్లారపు ప్రకాశరావు, సిహెచ్.సుబ్బారావు, సీనియర్ నాయకులు వీర్ల వెంకటేశ్వర్లు తదితరులు శనివారం వారి ఇంటికి వెళ్లి అనూషను పరామర్శించి, ఆమె కుటుంబానికి ధైర్యం చెప్పారు. కుటుంబ సభ్యులు మాట్లాడుతూ ఇంతవరకు ఏ పార్టీ నాయకులుగానీ, అధికారులుగానీ వచ్చి చూడలేదని, మీరు రావటంతో మాలో మాకు ధైర్యం వచ్చిందని చెప్పారు.

శివాలయానికి రూ.10 వేలు విరాళం

ప్రజాశక్తి-ఎటపాక : మండలంలోని బుట్టయిగూడెం గ్రామంలోని శివాలయానికి కూనవరం మండలం గొమ్ము అయ్యవారిగూడెం గ్రామానికి చెందిన కర్నాటి శ్రీనివాసరావు రూ.10వేలు విరాళాన్ని ఆలయ కమిటీకి శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన కుమారుడు కర్నాటి మోహన్ ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రం రాయ్‌పూర్‌లో ఎన్ఐటిలో అసిస్టెంట్ ప్రొఫసర్‌గా జాయిన్ అయిన నేపథ్యంలో ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న శివాలయానికి విరాళం ఇచ్చినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు అరవ కామేశ్వరరావు, కుసుమరాజు సురేష్, పులుసు కోటేష్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎలక్ట్రీషియన్స్ డే

ప్రజాశక్తి-రంపచోడవరం : మండలంలోని శ్రీవిజయ సాయి దుర్గ ప్రైవేట్ ఎలక్ట్రిషన్స్ అండ్ ప్లంబర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం ఎలక్ట్రీషియన్స్ డే ఘనంగా నిర్వహించారు. ముందుగా పిఎంఆర్‌సి నుండి అంబేద్కర్ సెంటర్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం సభాస్థలికి చేరుకొని యూనియన్ అభివృద్ధి కోసం ఈ ఏడాది చేయవలసిన కార్యాచరణను సభ్యులందరూ రూపొందించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రెసిడెంట్ వై.పోసి బాబు, ట్రెజరర్ డి రమేష్, ప్రసాద్, సురేష్, యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

నేడు నాలుగు మండలాల్లో విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి-రంపచోడవరం : జాతీయ రహదారి విస్తరణలో భాగంగా గంగవరం, అడ్డతీగల, రాజవొమ్మంగి, వై.రామవరం మండలాల్లో ఆదివారం ఉదయం 10 నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని విద్యుత్ శాఖ ఇఇ ఎండి.యూసఫ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనికి విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఆర్‌టిసి కార్మికుల దీక్షలు భగ్నం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : అపరిష్కృత సమస్యల పరిష్కారం కోసం నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలను శనివారం పోలీసులు భగ్నం చేశారు. ఈ దీక్షలు పది రోజులుగా కొనసాగుతున్న విషయం తెలిసిందే. అయితే ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి విశాఖ పర్యటన నేపథ్యంలో పోలీసులు శనివారం మధ్యాహ్నం దీక్షా శిబిరం వద్దకు చేరుకుని బలవంతంగా టెంట్‌ను తొలగించి దీక్షలను భగ్నం చేశారు.

కాషాయ నేత కిరాయి చేష్టలు..!

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

'పిచ్చోడి చేతిలో రాయి' అంటే ఎలా ఉంటుందో కాషాయ పార్టీకి చెందిన రాజ్యసభ సభ్యుడు జివిఎల్.నరసింహారావును చూస్తే ఇట్టే అర్థమవుతుంది. గడచిన కొన్ని నెలలుగా విశాఖ కేంద్రంగా తిష్టవేసిన ఆయన కేంద్ర ప్రభుత్వ అండ చూసుకుని ఇక్కడ పరిశ్రమాధిపతులను బెదిరిస్తూ పబ్బం గడుపుకుంటున్నారు. తనపై విమర్శలు నానాటికీ పెరుగుతున్నా ఆయనకు చీమకుట్టినట్టయినా లేకపోవడం గమనార్హం. సంక్రాంతి పేరుతో కొద్ది రోజుల క్రితం దందా సాగించాడు. 'నవ్విపోదురు గాక నాకేటి సిగ్గు' అన్న చందాన చందాలు దండుతూ దందా సాగించే జివిఎల్ తనపై వచ్చిన ఆరోపణలపై ఎదురుదాడికి దిగేయత్నాలూ చేశారు. ఇదంతా చూస్తే ఆయనది ఎంతటి బరితెగింపో అర్థమవుతుంది. తాజాగా వైజాగ్ వైబ్రంట్ పేరుతో జరిపే ఉత్సవాల్లో ఆంతర్యం ఏమిటి ? అన్న ప్రశ్నే ఇప్పుడు అందరిలో ఉద్భవిస్తోంది. అత్యంత భారీ పరిశ్రమ వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను తమ ప్రభుత్వం మట్టుపెట్టాలని అమ్మేసేందుకు మూడేళ్లుగా ప్రయత్నిస్తుంటే వైజాగ్‌కు వైబ్రంట్ ఎలా ఈ జివిఎల్ అద్దుతారు ?. వాల్తేరు రైల్వే డివిజన్‌ను ఎత్తేసి ఆదాయానికి గండికొట్టిన జివిఎల్ పార్టీ బిజెపి వైజాగ్‌ను వైబ్రంట్‌గా ఎలా చేస్తుంది ? రైల్వేజోన్‌పై దొంగ నాటకాలతో సదరు నేత కాలయాపన చేయడం కూడా వైబ్రంటేనా ? అంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు.

చిందులు, విందులతో వైజాగ్ వైబ్రంట్ అవుతుందా?

2024 సాధారణ ఎన్నికల్లో విశాఖ నుంచి ఎంపీగా బరిలో దిగేందుకు సన్నాహాలు చేస్తూ.. సదరు నాయకుడు విశాఖ కేంద్రంగా వేస్తున్న చిందులపై పలు తరగతులకు చెందిన ప్రజానీకం, మేధావులు పెదవి విరుస్తున్నారు. ఉత్తరప్రదేశ్ నుంచి రాజ్యసభకు బిజెపి ద్వారా నామినేట్ చేయబడిన జివిఎల్ విశాఖలోని ప్రభుత్వ రంగ సంస్థలపై ఆర్థిక భారాలు మోపుతూ ఇక్కడ పబ్బం గడుపుకోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మొన్నటి వరకూ సంక్రాంతి సంబరాలు ఐదు రోజుల పాటు ఎయు గ్రౌండ్స్‌లో నిర్వహించి తీన్‌మార్ డ్యాన్సులు యువతతో చేయించారు. తాజాగా వైబ్రంట్ వైజాగ్ పేరుతో రిపబ్లిక్ డేను పురస్కరించుకుని విశాఖలో హల్‌చల్ చేశారు. 2024 ఎన్నికల్లో విశాఖపట్నం పార్లమెంట్ స్థానానికి బిజెపి తరపున టికెట్ ఆశిస్తూ విశాఖ వాసులపై వల్లమాలిన అభిమానం చూపుతూ ఆయన ప్రవర్తిస్తున్న తీరు జుగుప్సను కలిగించక మానదు. అంతపెద్ద రిపబ్లిక్ డే ఉత్సవాల సందర్భంగా దేశభక్తికి చిహ్నంగా నిలిచే డాక్టర్ బిఆర్ అంబేద్కర్, మహాత్మా గాంధీ వంటి నేతలను స్మరించకుండా 'పబ్ డ్యాన్సులు'కు జివిఎల్ ప్రాధాన్యమిచ్చారు. విశాఖకు చెందిన స్టీల్‌ప్లాంట్, రైల్వేజోన్, జాతీయ రహదారులు, ఫ్లై ఓవర్‌ల సమస్యల నుంచి ప్రజలను పక్కదోవపట్టించే చిందులు, విందులకు జివిఎల్ ప్రాధాన్యమివ్వడం ఏపాటి వైజాగ్ వైబ్రంట్ ? అన్న ప్రశ్న నేడు సర్వత్రా వినిపిస్తోంది.

ప్రభుత్వ నిర్బంధాన్ని ఎదుర్కొని పోరాట విజయాలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : రాష్ట్రంలో అంగన్వాడీ, మున్సిపల్, సమగ్ర శిక్ష ఉద్యోగులు, కార్మికులు పెద్ద ఎత్తున సమ్మె చేశారని, దీన్ని విచ్ఛిన్నం చేయడానికి ప్రభుత్వం శతవిధాలా ప్రయత్నించి చివరికి ఉద్యోగాలు తొలగించడానికి పూనుకున్నా ఆ మూడు రంగాల కార్మికులు ఐక్యంగా పోరాడి విజయం సాధించారని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు తెలిపారు. జగదాంబ దరి సిఐటియు కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా లక్షా ఎనిమిది వేల మంది అంగన్వాడీ ఉద్యోగులు 43 రోజులపాటు ఐక్యంగా ఉద్యమించారన్నారు. వారి పోరాటాన్ని ప్రారంభం నుంచీ అణచివేయడానికి రాష్ట్ర వైసిపి ప్రభుత్వం ప్రయత్నాలు చేసిందన్నారు. ప్రారంభంలో సచివాలయ సిబ్బంది ద్వారా అంగన్వాడీ సెంటర్లను తెరిపించడానికి చేసిన ప్రయత్నాలు ఫలించకపోవడంతో అంగన్వాడీలు ఉద్యోగాల్లో చేరకపోతే ఎస్మాను ప్రయోగిస్తామని చట్టాన్ని తెచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. పోరాటం మరింత ఉధృతం కావడంతో వారి ఉద్యోగాలు తొలగిస్తామని బెదిరించడం, నోటీసులు జారీచేయడం చేసిందన్నారు. చలో విజయవాడకు రాకుండా అడ్డుకుందన్నారు. అయినా ప్రభుత్వం అంగన్వాడీల పోరాటానికి దిగి రాకతప్పలేదన్నారు. ఈ పోరాటంతో అంగన్వాడీలకు జీతాలను జూలై నుండి అమలు జరుపుతామని ప్రభుత్వం హామీ ఇచ్చిందన్నారు. మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చడంతో పాటు అనేక డిమాండ్లను అంగన్‌వాడీలు సాధించుకున్నారన్నారు. మున్సిపల్, సమగ్ర శిక్ష ఉద్యోగులు కూడా పోరాడి విజయాలు అందుకున్నారన్నారు.

రాష్ట్ర మహాసభను జయప్రదం చేయండి

యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ నేతలు

ప్రజాశక్తి -సీలేరు : యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర రెండో మహాసభ నెల్లూరులో ఈ నెల 28న జరుగుతుందని, ఇందులో కాంట్రాక్టు కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సీలేరు కాంట్రాక్ట్ కార్మిక సంఘం అధ్యక్ష కార్యదర్శులు బి.లక్ష్మణరావు, విష్ణుకుమార్ పిలుపునిచ్చారు. స్థానిక విలేకరులతో శనివారం వారు మాట్లాడుతూ నెల్లూరులో నిర్వహించే మహాసభకు తాము హాజరవుతున్నట్లు చెప్పారు. విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు న్యాయమైన సమస్యలు పరిష్కారానికి యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంటాక్ట్ వర్కర్స్ యూనియన్ హెచ్-176 (సిఐటియు) నిరంతరం పోరాడుతుందని తెలిపారు. ముఖ్యమంత్రి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలకు అనుగుణంగా కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు.

తెలంగాణ తరహాలో డైరెక్ట్ పేమెంట్ సాధనకు విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న కార్మికులందరినీ సంస్థ విలీనం చేయాలని కోరారు. నూతన షిఫ్ట్ ఆపరేటర్లకు పాత ఆపరేటర్లతో సమాన వేతనం చెల్లించాలని కోరారు. మీటర్ రీడర్లకు ఉద్యోగ భద్రత కల్పించి, కనీస వేతనం అమలు చేయాలన్నారు. విద్యుత్ కాంట్రాక్టు కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను మహాసభలో చర్చించనున్నట్లు చెప్పారు.

సభకు తరలివెళ్తున్న వైసిపి నాయకులు

'సిద్ధం' బహిరంగ సభకు తరలివెళ్లిన వైసిపి శ్రేణులు

ప్రజాశక్తి-కొయ్యూరు : ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్న విశాఖ జిల్లా భీమిలి నియోజకవర్గం, సంగివలస వద్ద శనివారం జరిగిన సిద్ధం బహిరంగ సభకు కొయ్యూరు మండలం నుంచి వైసిపి శ్రేణులను రెండు బస్సుల్లో తరలివెళ్లారు. ఎంపిపి బడుగు రమేష్, జెడ్పిటీసీ వారా నూకరాజు, ఏఎంసీ చైర్మన్ జైతి రాజులమ్మ, వైసీపీ మండల అధ్యక్షుడు జల్లి బాబులు ఆధ్వర్యంలో మండలం నుంచి పలువురు సర్పంచులు, ఎంపిటీసీ సభ్యులు, వివిధ నామినేటెడ్ పదవుల్లో ఉన్న వారు, వైసీపీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు బయలుదేరి వెళ్లారు.

బైక్ అపహరణపై పోలీసులకు ఫిర్యాదు

ప్రజాశక్తి-కొయ్యూరు : కొయ్యూరు మండలం బట్టపనుకుల గ్రామానికి చెందిన గడుతూరు సాయి రమణ అనే వ్యక్తికి చెందిన పల్సర్ ద్విచక్ర వాహనం చోరీకి గురైంది. ఈ మేరకు కొయ్యూరు ఎస్ఐ రామకృష్ణకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. పనుల నిమిత్తం బయటకు వెళ్లి వచ్చిన తర్వాత గురువారం రాత్రి యధావిధిగా ఇంటి దగ్గరే పెట్టిన బైక్ శుక్రవారం తెల్లవారి లేచి చూసేటప్పటికి కనిపించ లేదని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు.

50 లీటర్ల నాటుసారా స్వాధీనం

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : మండలంలోని బడదనాంపల్లి పంచాయతీ పరిధి కిమ్మలిగెడ్డ గ్రామ శివారు రిజర్వ్ ఫారెస్ట్ సమీపంలో అదే గ్రామానికి చెందిన కాకర జోగిరాజు అనే వ్యక్తి సారా బట్టీ నిర్వహిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు రాజవొమ్మంగి ఎస్ఐ ఎస్.వెంకయ్య ఆధ్వర్యంలో సిబ్బంది శనివారం దాడి నిర్వహించారు. నాటు సారా విక్రయిస్తున్న జోగురాజును అరెస్ట్ చేసి, ఆయన వద్ద నుండి 50 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని కేసు నమోదు చేసి అడ్డతీగల కోర్టుకు తరలించినట్లు ఎస్ఐ వెంకయ్య తెలిపారు.

ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు ప్రశంసా పత్రం

ప్రజాశక్తి-రంపచోడవరం : విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసినందుకు గాను రంపచోడవరం ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.లక్ష్మికి శుక్రవారం పాడేరులో జరిగిన గణతంత్ర వేడుకలలో అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాన్ని అందజేశారు. ఆమెకు పలువురు అభినందనలు తెలిపారు.

ప్రశంసాపత్రంతో డాక్టర్ లక్ష్మి

ఉత్కంఠగా చదరంగం పోటీలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ వేదికగా ఎంవిపి.కాలనీలోని ఎస్3 స్పోర్ట్స్ ప్రాంగణంలో శ్రీ చెస్ అకాడమీ ఆధ్వర్యాన తలపెట్టిన రెండో అంతర్జాతీయ చదరంగం పోటీలు మూడో రోజూ ఉత్సాహంగా సాగాయి. శనివారం టాప్ సీడెడ్ క్రీడాకారుల మధ్య హోరాహోరీ పోటీ నెలకొంది. ఐదో రౌండ్ ముగిసేసరికి తెలంగాణ రాష్ట్రానికి చెందిన టాప్ సీడెడ్ క్రీడాకారుడు వి.రాఘవ్ శ్రీవత్సవపై తమిళనాడుకు చెందిన కె.దినేష్ బాబు విజయం సాధించాడు. ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు జిల్లాకు చెందిన కె.సురేష్‌పై ఏలూరు జిల్లాకు చెందిన మూడో సీడెడ్ క్రీడాకారుడు బి.లక్ష్మణరావు నెగ్గాడు.